క్లుప్తంగా

నిధులు విడుదలకు వినతి



వినతి పత్రం ఇస్తున్న పంచాయతీ కార్యదర్శులు

కోహెడ(హుస్నాబాద్): గ్రామ పంచాయతీల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం నుంచి చట్టబద్ధంగా రావల్సిన నిధులు వెంటనే విడుదల చేయాలని మండల గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఎంపీఓ సురేష్‌కు వినతి పత్రం అందజేశారు. కనీస మౌలిక సదుపాయాలు కల్పనకు, సిబ్బంది వేతనాల చెల్లింపు తదితర అవసరాలకు నిధులు కేటాయించాలని కోరారు. నిధులు లేక చెత్త సేకరణ, ట్రాక్టర్ల నిర్వహణకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ఉన్నతాధికారులకు నివేదించి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎంపీఓ హామీ ఇచ్చినట్లు మండల కార్యదర్శులు తెలిపారు. కార్యక్రమంలో సుధీర్, శోభ, నిహారిక, రఫీ తదితరులు పాల్గొన్నారు.

గుట్కాలు విక్రయిస్తే కఠిన చర్యలు



పోలీసులు స్వాధీనం చేసుకున్న గుట్కా ప్యాకెట్లు

గజ్వేల్‌రూరల్: ప్రభుత్వ నిషేధిత గుట్కాలను విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, గజ్వేల్ పోలీసులు హెచ్చరించారు. విశ్వసనీయ సమాచారం మేరకు గజ్వేల్ పట్టణంలోని గర్గ్ సచిన్ అగర్వాల్, ఇమ్మడి రవికుమార్ దుకాణాల్లో తనిఖీలు చేపట్టా రు. రూ.1.20 లక్షల విలువైన గుట్కాలు, అంబర్, బ్లూబుల్, గుట్కా ప్యాకెట్లు, బ్లాక్ సిగరెట్లు గుర్తించి, వాటిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. ప్రభుత్వం నిషేధించిన గుట్కాలపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఏదైనా సమాచారముంటే 87126 67445, 87126 67446, 87126 67447 నంబర్లకు తెలియజేయాలన్నారు.

కాంగ్రెస్‌కు 978 ఓట్లు

కొమురవెల్లి(సిద్దిపేట): పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మండలంలో 978 ఓట్లు వచ్చాయి. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి 1286 ఓట్లు అధిక్యం రాగా మంగళవారం వెలువడిన పార్లమెంట్ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీకి మెజార్టీ రావడంతో మండలంలో మళ్లీ కాంగ్రెస్ పార్టీ పుంజుకుంది. మర్రిముచ్చాలలో 98, కొమురవెల్లిలో 15, గౌరయపల్లిలో 36, ఐనాపూర్‌లో 317, గురువన్నపేటలో 39, పోసాన్‌పల్లిలో 95, లెనిన్‌నగర్‌లో 34, రాంసాగర్‌లో 79 ఓట్లు కాంగ్రెస్ పార్టీకి మెజార్టీరాగా బీజేపీకి మాత్రం కిష్టంపేటలో 57, తపాస్‌పల్లిలో 2 ఓట్లు వచ్చాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో అధిక్యం కనబరిచిన బీఆర్ఎస్ పార్టీకి ఏ గ్రామంలో కూడా మెజార్టీ లభించలేదు.

ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లాలో నిబంధనలు పాటించని కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలపై జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సిద్దిపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులను నియంత్రించాలన్నారు. అందుకోసం ప్రత్యేక జీవో తీసుకురావాలన్నారు. అనేక ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే పాఠ్యపుస్తకాలు, టై, బెల్ట్, షూలు విక్రయిస్తున్నారని ఆరోపించారు. పాఠశాలల ప్రారంభానికి ముందే అడ్మిషన్లు తీసుకుంటున్నారని మండిపడ్డారు. ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



మల్లికార్జున స్వామి ప్రసాదం అందజేస్తున్న నాయకులు

కొమురవెల్లి(సిద్దిపేట): మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను కొమురవెల్లి మల్లన్న ఆలయ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌లో బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. కొమురవెల్లి మల్లికార్జున స్వామి ప్రసాదాన్ని మంత్రికి అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలంలోని సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లగా త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

అన్నదాతపై సాగుభారం



దుక్కి దున్నుతున్న రైతు

- వర్షాలతో మొదలైన సాగు పనులు
- యంత్రాలతో దుక్కిదున్నకాలు
- రెట్టింపైన సాగు పెట్టుబడి వ్యయం
- ఆందోళనలో రైతులు

చిన్నకోడూరు(సిద్దిపేట): వ్యవసాయమే ప్రధాన జీవనాధారమైన సిద్దిపేట నియోజకవర్గ రైతులకు ఏటా పెట్టుబడి వ్యయం పెరిగి వారికి సాగు భారమవుతోంది. ఏటా పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలతో ఆందోళన చెందుతున్నారు. వానాకాలం పంటల సాగుకు భూములు సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. ప్రస్తుతం దుక్కి దున్నకాల పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. డీజిల్ ధరలు విపరీతంగా పెరగడంతో సన్న, చిన్నకారు రైతులపై మరింత భారం పడుతోంది. ఒక్కో గ్రామంలో ఐదు నుంచి పది ట్రాక్టర్లు ఉన్నాయి. పెరిగిన ఇంధన ధరలతో పంటలు సాగు చేయడం కష్టమవుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏటా పెట్టుబడి ఖర్చులు పెరుగుతున్న దానికి అనుగుణంగా మద్దతు ధరలు పెరగకపోవడంతో రైతులు నిరాశ చెందుతున్నారు.

పెరుగుతున్న ధరలు..

ఇంధన ధరలకు అనుగుణంగానే ట్రాక్టర్ యాజమానులు అద్దె ధరలు పెంచడంతో అన్నదాతలపై అదనంగా భారం పడుతోంది. ఏటా గంటకు రూ.100 నుంచి రూ.200 వరకు కిరాయి పెంచుతున్నారు. డీజిల్ ధరలు పెరగడంతో తమకు గిట్టుబాటు కావడం లేనది ట్రాక్టర్ యాజమానులు చెబుతున్నారు. తక్కువ సమయంలో ఎక్కువ పనులు చేసేలా రైతులు సాగు పనుల్లో యంత్రాలను ఎక్కువగా వినియోగిస్తున్నారు. ప్రతీ పనిని యంత్రాలతోనే చేపడుతున్నారు. ప్రస్తుతం యంత్రాలతో దుక్కిదున్నే పనులు జరుగుతున్నాయి. వానాకాలం పంటల సాగు కోసం పొలాలను చదును చేయడం, చెరువు, కుంటల నుంచి నల్లమట్టి తరలించడం లాంటి పనులు కొనసాగుతున్నాయి. అయితే డీజిల్ ధరలు పెరిగాయన్న సాకుతో ట్రాక్టర్ అద్దె అమాంతంగా పెంచేస్తున్నారు. గత్యంతరం లేని రైతులు ట్రాక్టర్ యాజమానులనే ఆశ్రయించాల్సి వస్తోంది. దుక్కి దున్నినప్పటి నుంచి పంట చేతికొచ్చే వరకు పెట్టుబడి ఖర్చులు భారీగా పెరిగిపోతున్నాయి. గతంలో ఎకరానికి రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు ఖర్చయ్యేది. కానీ, ప్రస్తుతం రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు పెట్టుబడి వ్యయం అవుతుందని రైతులు వాపోతున్నారు. దీనికి తోడు కూలీల కొరతతో యంత్రాల వినియోగం పెరిగిపోతుందన్నారు.

బీజేపీ సంబురాలు



హుస్నాబాద్‌లో బీజేపీ విజయోత్సవ ర్యాలీ

హుస్నాబాద్: కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ గెలుపొందడంపై బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం హుస్నాబాద్‌లో సంబరాలు నిర్వహించారు. గాంధీ చౌరస్తా నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ఆ పార్టీ నాయకులు విజయోత్సవ ర్యాలీ తీశారు. టపాసులు కాల్చి, మిఠాయిలు పంచి పెట్టారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి మాట్లా డుతూ బండి సంజయ్ ఎంపీగా రెండోసారి 2,25,209 ఓట్ల మెజార్టీతో గెలిపించడంతో మరింత బాధ్యత పెరిగిందన్నారు. పార్లమెంట్ పరిధిలో రాజకీయంగా, భౌగోళికంగా ఎన్నో సమస్యలు ఉన్నాయని వీటిని పరిష్కరించుకునేందుకు రాబోయే రోజుల్లో పోరాటాలు చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు అమలు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు లక్కిరెడ్డి తిరుమల, పట్టణ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్, నాయకులు బత్తుల శంకర్ బాబు, వీరాచారి, జైపాల్ రెడ్డి, సతీష్ పాల్గొన్నారు.

ఎన్ని కుట్రలు చేసినా విజయం సాధించాం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి



సంబురాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఎన్ని కుట్రలు పన్నినా ప్రజలు బీజేపీకే పట్టం కట్టారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మెదక్ ఎంపీగా రఘునందన్ రావు విజయం సాధించడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలు నిజాయితీ, అభివృద్ధికి ఓటు వేశారన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ ప్రజల విశ్వాసం కోల్పోయిందన్నారు. సిద్దిపేట పట్టణంలో 70 శాతం ఓట్లు బీజేపీకే పోల్ అయ్యాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వర్షపు నీటితో వాహనదారుల ఇబ్బందులు



అంబేద్కర్ చౌరస్తాలో నిలిచిన వర్షపు నీరు

చేర్యాల(సిద్దిపేట): ఈ ఫొటోలో కనిపిస్తున్నది స్థానిక అంగడి బజారులోని అంబేద్కర్ చౌరస్తా. బుధవారం కురిసిన వర్షానికి వచ్చిన నీరంతా రోడ్డుపై నిలిచింది. ప్రధాన కూడలి కావడం, నిత్యం వాహనాల రాకపోకలు ఉండే ఈ ప్రాంతంలో వర్షపు నీరు నిలిచిపోవడంతో రోడ్డుపై ఉన్న గుంతలు కనిపించక వాటిలోపడి వాహనదారులు గాయపడుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి నీరు నిల్వలేకుండా చర్యలు తీసుకోవడంతో పాటు గుంతలను పూడ్చాలని కోరుతున్నారు.

ఎంపీని కలిసిన నాయకులు



బండి సంజయ్‌తో మహిపాల్‌రెడ్డి

బెజ్జంకి(సిద్దిపేట): కరీంనగర్ ఎంపీగా రెండోసారి గెలిచిన బీజేపీ జాతీయ కార్యదర్శి బండి సంజయ్ కుమార్‌ను బుధవారం కరీంనగర్ పార్లమెంట్ కార్యాలయంలో బెజ్జంకి మండలానికి చెందిన పలువురు నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఆపార్టీ కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్‌రెడ్డి, సొల్లు అజయ్ వర్మ, బోయినిపెల్లి అనిల్‌రావు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేటలోని రంగథాంపల్లి 132 కేవీ/33 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సిద్దిపేట డివిజనల్ ఇంజనీర్ మహేష్‌కుమార్ బుధవారం తెలిపారు. సిద్దిపేట మున్సిపాలిటీ, సిద్దిపేట రూరల్ మండలం, నారాయణరావుపేట మండల పరిధిలోని నారాయణరావుపేట, లక్ష్మీదేవిపల్లి, కోదండరావుపల్లి, బంజారుపల్లి, ఇబ్రహీంపూర్‌తో పాటుగా, సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని పొన్నాల, కిష్ట సాగర్, ఎన్సాన్‌పల్లి, ప్రభుత్వ మెడికల్ కళాశాల, డీఎక్స్‌ఎన్ కంపెనీ, మిట్టపల్లి, ఎల్లుపల్లి గ్రామా ల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యా హ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.

బీజేపీ క్యాడర్‌లో ఫుల్ జోష్



దుబ్బాకలో బీజేపీ శ్రేణుల సంబరాలు

దుబ్బాక: మెదక్ ఎంపీగా రఘునందన్‌రావు గెలుపుతో బీజేపీ క్యాడర్‌లో ఫుల్ జోష్ నెలకొంది. గులాబీ అడ్డాలో కాషాయ జెండా ఎగరడంతో ఆ పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం కనిపిస్తుంది. మెదక్ పార్లమెంట్ పరధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీలో గుర్తింపు ఉన్న నాయకుడు లేకున్నా రఘునందన్‌రావు విజయం సాధించడం విశేషం. మెదక్ పార్లమెంట్ పరధిలో మాజీ సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్, ఎమ్మెల్యే హరీశ్‌రావు సిద్దిపేటతో పాటు దుబ్బాకలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, నర్సాపూర్‌లో సునీతారెడ్డి, సంగారెడ్డిలో చింతా ప్రభాకర్, పటాన్‌చెరులో గూడెం మహిపాల్‌రెడ్డి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉన్నారు. కేవలం మెదక్‌లో మాత్రమే కాంగ్రెస్ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఉండగా అనూహ్యంగా ఎంపీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు గెలుపొందడంతో బీజేపీలో ఉత్సాహం నెలకొంది.

గెలుపు సంబురాలు

రఘునందన్‌రావు గెలుపుతో బీజేపీ శ్రేణులు గెలుపు సంబరాల్లో మునిగి తేలుతున్నారు. మెదక్ పార్లమెంట్ పరధిలోని సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్, గజ్వేల్, దుబ్బాక, పటాన్‌చెరు, నర్సాపూర్ పట్టణాలతో పాటు అన్ని గ్రామాల్లో బీజేపీ శ్రేణులు టపాకాయలు కాల్చుతూ, స్వీట్లు పంచుకుంటూ సంబరాలు జరుపుకుంటున్నారు.

ఘనంగా పర్యావరణ దినోత్సవం

- మొక్కలు నాటిన అధికారులు, కూలీలు, విద్యార్థులు
- ప్రతీఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపు
- నీటి సంరక్షణ, ప్లాస్టిక్ వాడకం అనర్థాలపై అవగాహన



సిద్దిపేటలో మొక్కలను పంపిణీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి

కొమురవెల్లి(సిద్దిపేట): మండల వ్యాప్తంగా పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని గురువన్నపేట గ్రామంలో ఎంపీడీఓ కుమారస్వామి, పంచాయతీ కార్యదర్శి సతీష్ మొక్కలు నాటారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

అక్కన్నపేట(హుస్నాబాద్): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎంపీడీఓ భానోతు జయరాం అన్నారు. బుధవారం మండలంలోని మల్లంపల్లి ఊరచెరువు కట్టపై పంచాయతీ కార్యదర్శి సతీష్ నేతృత్వంలో ఉపాధి హామీ కూలీలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు.

బాడుగుల చెరువు వద్ద..

కోహెద(హుస్నాబాద్): ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బాడుగుల చెరువు వద్ద ఉపాధి హామీ కూలీలు మొక్కలు నాటారు. ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి దేవేందర్ పిలుపునిచ్చారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం

వర్గల్(గజ్వేల్): కాలుష్యకారకాలను నిర్మూలిద్దాం, మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని వర్గల్ ఎంపీడీఓ విజయలక్ష్మి పిలుపు ఇచ్చారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వర్గల్ అమృత్ సరోవర్ వద్ద మొక్కలు నాటారు. నీటి సంరక్షణ, ప్లాస్టిక్ వాడకం అనర్థాలు, మొక్కల పెంపకం ప్రయోజనాలను వివరించారు.

ఇస్తరాకుల పంపిణీ

మద్దూరు(హుస్నాబాద్): ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. మద్దూరు మండల పరిధిలోని సలాఖ్‌పూర్, మరుమాముల, రేబర్తి గ్రామాల్లో అమృత్ సరోవర్ చెరువుల వద్ద, మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల ఆవరణల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. పర్యావరణాన్ని పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆకులతో తయారు చేసిన ఇస్తరాకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో, ఎంపీవో, ఈసీ, టీఎసీ, పీఎస్, ఎఫ్ఏసీలు పాల్గొన్నారు.

మట్టి కుండలు, స్టీల్ పాత్రలు..

జగదేవ్‌పూర్(గజ్వేల్): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని దేశ్ పాండే ఫౌండేషన్ మేనేజర్ రాజేందర్ అన్నారు. బుధవారం మండలంలోని వట్టిపల్లి గ్రామంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలుష్యాన్ని, ప్లాస్టిక్ వస్తువులను తగ్గించి కాలుష్యాన్ని జీవ వైవిధ్యాన్ని మెరుగు పరచవచ్చన్నారు. మట్టి కుండలు, స్టీల్ పాత్రలను వాడాలని సూచించారు.

విరివిగా మొక్కలు నాటి..

సిద్దిపేట ఎడ్యుకేషన్: విరివిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని సిద్దిపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీవన్‌కుమార్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పర్యావరణ సమతుల్యత లోపిస్తే జీవజాలం తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్ల ర్యాలీ

గజ్వేల్‌రూరల్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం ఎన్‌సీసీ క్యాడెట్లు గజ్వేల్ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. గజ్వేల్ సీఐ సైదా జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ శిక్షణ శిబిరం అధికారులు, కాడెట్లు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయంలో..

సిద్దిపేటఅర్బన్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం సిద్దిపేట కేంద్రీయ విద్యాలయం ఆవరణలో విద్యార్థులు మొక్కలు నాటారు. యూనియన్ బ్యాంకు మేనేజర్ వికాస్ హాజరై విద్యార్థులతో పాటు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజేశ్వరి, పీఈటీ భూమయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజల బాధ్యత

సిద్దిపేటజోన్: పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ నడుం బిగించాలి, ఇది ప్రజల బాధ్యతని మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి అన్నారు. బుధవారం పర్యావరణ దినోత్సవం సందర్భంగా మున్సిపల్ ఆధ్వర్యంలో పట్టణంలో అవగాహన ర్యాలీ తీశారు. కోమటిచెరువు వద్ద రూబీ నెక్లెస్ రోడ్ వద్ద ప్రజలకు డాక్టర్ స్వామి ఆధ్వర్యంలో ఉచితంగా మొక్కలు పంపిణీ చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల వద్ద..

మిరుదొడ్డి(దుబ్బాక): మండలంతో పాటు, అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలో బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ పంచాయతీల వద్ద మొక్కలను నాటారు. ఆయా కార్యక్రమాల్లో కార్యదర్శులు, సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు తుమ్మల బాల్‌రాజు పాల్గొన్నారు.

ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ హవా

కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్



మాట్లాడుతున్న అత్తు ఇమామ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హవా కొనసాగిందని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మెదక్ ఎంపీ నియోజకవర్గ పరిధి సిద్దిపేట అసెంబ్లీ నియోజకవర్గంలో తమ పార్టీ ఓటు శాతం పెరిగిందన్నారు. ఎంపీ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కలిసి కాంగ్రెస్ పార్టీని ఓడించేందుకు కృషి చేశాయని ఆరోపించారు. మెదక్ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తన ప్రభావాన్ని చూపించలేకపోయిందని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ విజయానికి తీవ్రంగా కృషి చేశారన్నారు. అదేవిధంగా ప్రజలు కాంగ్రెస్ పార్టీ ప్రవేశ పెట్టిన ఆరుగ్యారంటీలను నమ్మి కాంగ్రెస్ పార్టీకి భారీగా ఓట్లు వేశారన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భారీ విజయాలు నమోదు చేసుకుంటామన్నారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలో పూర్తిగా జీరో స్థాయికి పడిపోయిందన్నారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి గ్యాదరి మధు, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు మజార్ మాలిక్, పట్టణ యువజన అధ్యక్షుడు గయాజుద్దీన్, ఎన్ఎస్‌యూఐ వర్కింగ్ ప్రెసిడెంట్ రాషీద్, నజ్జు, అయ్యూబ్, ఫయాజ్, అనిల్, రాజు, తదితరులు పాల్గొన్నారు .

సంక్షిప్త వార్తలు

◆ బాణాసంచా కాల్చి స్వీట్లు పంచి..

కోహెద(హుస్నాబాద్): కరీంనగర్ ఎంపీగా వరుసగా రెండోసారి బండి సంజయ్ విజయం పురస్కరించుకొని బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి సంబురాలు నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తా వద్ద బాణాసంచా కాల్చి స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఖమ్మం వెంకటేశం, గుగ్గిళ్ల శ్రీనివాస్, జగన్, శ్రీకాంత్, నర్సయ్య, రమేశ్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

◆ మహిళలకు రక్షణగా షీటీమ్స్

సిద్దిపేటకమాన్: జిల్లాలోని షీటీమ్స్‌తో మహిళలు, బాలికలకు భద్రత, భరోసా కల్పిస్తున్నట్లు సిద్దిపేట సీపీ అనురాధ బుధవారం తెలిపారు. జిల్లాలోని షీటీమ్స్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్స్ అధికారులు, సిబ్బంది మేలో వివిధ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. 108 మంది ఈవ్‌టీజర్లను పట్టుకుని కేసులు నమోదు చేసి, వారికి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు చెప్పారు. సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్ డివిజన్‌ల వారీగా షీటీమ్స్ పనిచేస్తున్నట్లు తెలిపారు. మహిళలు, బాలికలు, విద్యార్థినులు షీటీమ్స్ సేవలు వినియోగించుకోవాలని సూచించారు. మహిళలకు ఏదైనా సమస్య వస్తే అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100 లేదా షీటీమ్ వాట్సప్ నంబర్ 87126 67434కు సమాచారం అందించాలన్నారు.

◆ మల్లికార్జున స్వామికి అన్నాభిషేకం

కొండపాక(గజ్వేల్): మండలంలోని మర్పడ్గలోగల విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో మాస శివరాత్రిని పురస్కరించుకొని బుధవారం మల్లికార్జున స్వామికి అన్నాభిషేకం నిర్వహించారు. క్షేత్రం నిర్వాహకుడు చెప్పెల హరినాథ శర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

◆ అధైర్య పడం.. కేసీఆర్ వెంటే

మిరుదొడ్డి(దుబ్బాక): పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి పాలైనప్పటికీ అధైర్యపడమని, తాము కేసీఆర్ వెంటే ఉంటామని బీఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకుడు సూకూరి లింగం అన్నారు. బుధవారం మిరుదొడ్డిలో ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమితో పార్టీ కోటకు బీటలు అంటూ కొందరు పనిగట్టుకొని అసత్య ప్రచారానికి తెరలేపుతున్నారన్నారు. తెలంగాణ ఉద్యమ పార్టీగా మొదలై రాజకీయ పార్టీగా ఎదిగిన బీఆర్ఎస్‌కు గెలుపు ఓటములు సహజమన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి గెలుపు కోసం పార్టీ కార్యకర్తలు కృషి చేసినప్పటికీ ఓడిపోవడంత నిరాశ పరిచిందన్నారు. ప్రజా తీర్పును శిరసావహిస్తూనే పార్టీ బలోపేతానికి కృషిచేస్తామన్నారు. ఓటమికి కార్యకర్తలు కుంగిపోవద్దన్నారు.

◆ నీట్‌లో మెరిసిన గిరిజన విద్యార్థులు

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం జిల్లెలగడ్డ గిరిజన గురుకుల ప్రతిభా కళాశాల విద్యార్థులు నీట్‌లో 12 మంది అర్హత సాధించినట్లు ప్రిన్సిపాల్ జయరాంరెడ్డి బుధవారం తెలిపారు. ఏ.మోహన్ 433 మార్కులు, పి.ధర్మా 388 మార్కులు సాధించారన్నారు. ఆర్‌సీఓ వెంకన్న అభినందించారు.

◆ సీఎంని కలిసిన నాగపురి

చేర్యాల(సిద్దిపేట): ఎంపీ ఎన్నికల ఫలితాల్లో భువనగిరి ఎంపీగా భారీ మెజార్టీతో గెలుపొందిన చామల కిరణ్ కుమార్‌రెడ్డితో కలిసి కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్ సీఎం రేవంత్ రెడ్డిని బుధవారం కలిశారు. సీఎంకు పూలగుచ్ఛం అందజేసి శాలువా కప్పి సత్కరించారు. ఎంపీ ఎన్నికల్లో జనగామ నియోజకవర్గంలో మంచి మెజార్టీ వచ్చేలా కృషి చేసిన కార్యకర్తలను సీఎం ప్రశంసించినట్లు కిరణ్ చెప్పారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని చెప్పారన్నారు.

◆ 8న మెగా డ్యాన్స్ ఈవెంట్

సిద్దిపేట కమాన్: సిద్దిపేట ఎన్‌జీవోస్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఈనెల 8వ తేదీన డ్యాన్స్ ఈవెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు గిరి తెలిపారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 45 రోజులుగా నిర్వహించిన సమ్మర్ క్యాంపు ముగింపు సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

◆ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

గజ్వేల్‌రూరల్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి అన్నారు. బుధవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద వాహనదారులు, ప్రజలకు ట్రాఫిక్, రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు.

◆ క్రీడా దుస్తుల బహూకరణ

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్)లోని కబడ్డీ వేసవి శిక్షణ శిబిరం మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు కేడం లింగమూర్తి మాట్లాడుతూ యువత క్రీడల్లో ప్రావీణ్యం సంపాదించాలన్నారు. చదువుతో పాటు ఆటలు కూడా ముఖ్యమన్నారు. పోతారం(ఎస్) గ్రామానికి చెందిన సీనియర్ క్రీడాకారుడు, ఆర్మీ జవాన్ సాయికృష్ణ జూనియర్ కబడ్డీ క్రీడాకారులకు క్రీడా దుస్తులను బహూకరించారు.